క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కేటీదొడ్డి: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని సీఆర్పీ యుగంధర్, శివరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని కొండాపురంలో శుక్రవారం బడిబయటి పిల్లల ఇంటింటి సర్వే కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు డ్రాప్అవుట్ కావడానికి గల కారణాలను, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

ధరూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18న సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ తెలిపారు. మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

పది వేల మొక్కలు తప్పనిసరిగా పెంచాలి



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీల్లో పది వేల మొక్కలను తప్పనిసరిగా పెంచాలని ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని తనగలలోని నర్సరీని ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి మోహన్, వనసేవకుడికి సూచనలు, సలహాలు ఇచ్చారు. నర్సరీలోని బ్యాగుల్లో చింత, మునగ తదితర విత్తనాలు నాటారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ తిరుపతన్న ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



శాంతినగర్: తాను ఓడిపోయినప్పటికీ కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటానని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో కార్యకర్తలు నిరుత్సాహ పడుతున్నారని తెలుసుకుని వారితో ముఖాముఖి మాట్లాడారు. ఎవరూ అధైర్యపడవద్దని, అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మొదటి ఉపప్రధాని, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడారు. దేశంలోని అనేక సంస్థానాలకు భారతదేశంలో విలీనం చేసి ఉక్కు మనిషిగా పేరుగాంచారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించండి



అయిజ: మున్సిపాలిటీలోని కమతంపేటలో నిర్మించిన డ్రెయినేజీలో మురుగు తొలగించకపోవడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఆయా కాలనీల ప్రజలు చెత్తను డ్రెయినేజీల్లో వేస్తుండటంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువైందని, దాంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

జోరుగా యాసంగి సాగు

- నెట్టెంపాడు ఎత్తిపోతల జలాలతో పెరిగిన విస్తీర్ణం
- కూలీలకు డిమాండ్
- ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్న రైతులు
- ప్రధాన కాల్వలో తగ్గుతున్న నీటి మట్టం
- ఆందోళన చెందుతున్న రైతులు



జాంపల్లి శివారులో ట్రాక్టర్‌తో కలిగెట చేస్తున్న రైతులు

ధరూరు: మండలంలో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుతూ వస్తోంది. దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి మండలంలో రూ.1,400 కోట్ల వ్యయంతో మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావడంతో కొన్నేళ్లుగా అధికారులు చెరువులు నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు రైతులకు సాగు నీటిని అందిస్తూ వస్తున్నారు. రైతులు తమ బీడు భూములను సాగులోకి తీసుకొస్తున్నారు. పంట సాగు ఏటా పెరగడంతో పాటు కూలీల కొరత కూడా ఏర్పడుతోంది.

ఏటా పెరుగుదల

మండలంతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా మల్దకల్, గద్వాల, గట్టు, కేటీదొడ్డి మండలాలకు సాగు నీరందుతోంది. మండలంలో రెండు వారాలుగా సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ సారి దాదాపు 2 వేలకు పైగా హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆర్ఎన్ఆర్(సోనమసూరి) రకాలను సాగు చేస్తున్నారు. మెట్టపొలాలు సైతం సాగులోకి వస్తున్నాయి. పొలాలను లెవలింగ్ చేయించుకుని రైతులు వేరుశనగ పంటలతో సరి పెట్టుకుంటున్నారు. యాసంగిలో నీళ్లు పుష్కలంగా ఉంటే చాలు పంట దిగుబడి అనుకున్నంత వస్తుందని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు దాదాపుగా సాగు పనులు పూర్తయ్యే అవకాశం ఉందని, అక్కడక్కడ మిగిలిన రైతులు జనవరి మొదటి, రెండో వారం వరకు వరినాట్లు కొనసాగే అవకాశం ఉంది.



ధరూరు శివారులో నాట్లు వేస్తున్న కూలీలు

రైతుల ఇబ్బందులు..

ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. ఈ నెల మొదటి వారం వరకు ఒక్కో మహిళకు నాటు వేసేందుకు రూ.350 నుంచి రూ.400 చెల్లిస్తున్నారు. అయినా కూలీలు సమయానికి దొరక లేదు. మరో వారం రోజులు గడిస్తే కూలీల రేట్లు రెట్టింపయ్యే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

కొనసాగుతున్న నీటి పంపింగ్...

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులకు అంతంత మాత్రంగానే నీళ్లు చేరాయి. కృష్ణానదిపై తెలంగాణలో మొదటి ప్రాజెక్టు జూరాల కావడం.. ప్రాజెక్టుకు స్వల్పంగా ఇన్‌ఫ్లోలు కొనసాగుతుండటం.. వంటి పరిణామాల నేపథ్యంలో సాగు నీటిపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ సారి రెండో పంటకు నీళ్లు ఇవ్వడం కష్టమే అని అధికారికంగా అధికారులు ప్రకటించలేదు. దీంతో రైతులు పంట సాగు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన కాల్వ వెంట ఉన్న రైతులు పంట సాగుపై దృష్టి కేంద్రీకరించినట్లుగా తెలుస్తోంది. లిఫ్టు-1 గుడ్డెందొడ్డి నుంచి లిఫ్టు-2 మార్లబీడు వరకు ఉన్న ప్రధాన కాల్వ కింద రైతులు ఏడెనిమిదేళ్లుగా సాగు చేసుకుంటున్నారు.

నెట్టెంపాడు జలాలతో సాగు



నెట్టెంపాడు కాల్వ కింద వానా కాలం పంటలను సాగు చేసుకుంటున్నాం. ఐదారు ఏళ్లుగా ఈ కాల్వను నమ్ముకుని పంటలను సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుతం రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.ముందస్తుగా సాగు పనులు కొనసాగిస్తున్నాం.

– నర్సిరెడ్డి, జాంపల్లి

పంట పూర్తయ్యే వరకు నీళ్లివ్వాలి



పంటలకు పంట కాలం పూర్తయ్యే వరకు సాగు నీళ్లివ్వాలి. రెండేళ్ల కిందట రైతులకు నీళ్లు అందించకపోవడంతో ఎండిపోయి నష్టాల బాట పట్టాం. ఈ సారైనా పూర్తిస్థాయిలో నీళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– పొంటన్న, ధరూరు

నీటి విడుదల లేదు

ఈ ఏడాది ఆశించినంతగా వర్షాలు కురవలేదు. తద్వారా ప్రాజెక్టులకు నీళ్లు చేరలేదు. దీంతో ప్రతి ఏటా మాదిరిగా ఈ సారి రెండో పంటకు సాగు నీరందించడం సాధ్యపడదు. నెట్టెంపాడు ప్రాజెక్టు కింద రైతులు పంట సాగు చేసుకుని నష్టపోవద్దు. పంటలు సాగు చేసుకుని నీళ్లివ్వాలని కోరినా.. ఇచ్చేందుకు ప్రాజెక్టుల్లో నీళ్లు లేవు.

– వెంకటేశ్వరరావు, ఈఈ పీజేపీ

బ్రహ్మోత్సవాలకు ఆదిశిలా క్షేత్రం ముస్తాబు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శుక్రవారం ఆలయ గాలిగోపురంతో పాటు గర్భాలయం, ఆలయ పరిసరాలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, చైర్మన్ ప్రహ్లాదరావు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ చైర్మన్‌తో పాటు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

రైతు సంబరాలకు సహకరించాలి

ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే రైతు సంబరాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ వంతు సహకరించాలని ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ యాకోబు ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. రైతు సంబరాలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తిమ్మారెడ్డి, సీతారామిరెడ్డి, పెద్దవీరన్న, వెంకటన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



గోపురానికి రంగులు వేస్తున్న సిబ్బంది

రథోత్సవానికి మరమ్మతులు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రథోత్సవానికి ఆలయ చైర్మన్, అధికారులు మరమ్మతులు చేయించారు. వందేళ్ల కిందట తయారు చేయించిన రథోత్సవానికి కింది భాగంలో చిన్నపాటి మరమ్మతులు ఉండటంతో వాటికి మరమ్మతులు చేయించి, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత్రదానం పలువురికి ఆదర్శం



నేత్రదానం చేస్తున్న కుటుంబ సభ్యులు

మానవపాడు: మనం జీవించి ఉన్నప్పుడే కాదు.. మరణించినా మరొకరికి సాయం చేయచ్చుని నిరూపించారు.. మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన బుచ్చమ్మ. శుక్రవారం అనారోగ్య కారణాలతో బుచ్చమ్మ మృతిచెందారు. మృతిచెందిన అనంతరం ఆమె కళ్లను కర్నూల్ రీజినల్ కంటి ఆస్పత్రికి నేత్రదానం చేశారు. కళ్లను దానం చేయడంతో పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. ఇద్దరు కుమారులు శ్రీను, నాగరాజు కొన్ని సంవత్సరాల కిందటే మృతిచెందారు.

కొర్విపాడులో ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపు

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో శుక్రవారం ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపు ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ హెల్త్ క్యాంపు నిర్వహించామని కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ క్యాంపులో 200మంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించామని చెప్పారు. ప్రతి ఒక్కరికి రక్తపరీక్షలు నిర్వహించామన్నారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యం

ధరూరు: 'కుటుంబ నియంత్రణలో పురుష భాగస్వామ్యం అందిస్తుంది.. తల్లీ బిడ్డల ఆరోగ్యం' అనే నినాదంతో వాసెక్టమీ ఆపరేషన్‌తో కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని మండల ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఈ అంశంపై పూర్తిగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన

రాజోళి: కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లో భాగంగా ఈ నెల 24న మగవారికి చేసే వేసక్టమి ఆపరేషన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజోళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ మధుబాబు ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ ఆపరేషన్ చేయించుకోవడంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, ఈ ప్రక్రియ చాలా సులువుగా త్వరగా జరుగుతుందని, అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి, ఆపరేషన్ చేయించుకునే వారికి అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



ధరూరు గ్రామపంచాయతీ వద్ద అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్య వేక్షకుడు హీర్యానాయక్

పొంచి ఉన్న ప్రమాదం



అయిజ: పట్టణ సమీపంలోని కర్నూల్ రోడ్డులో పెద్ద వాగుపై కొన్ని సంవత్సరాల కిందట నిర్మించిన బ్రిడ్జి శిథిలమైంది. ఇరువైపుల బ్రిడ్జి అంచును సూచించే రాళ్లు తొలగిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయంలో వాహనాల్లో వచ్చే వారికి బ్రిడ్జి అంచులు ఎక్కడున్నాయో తెలియకపోవడంతో చాలామార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సంబంధిత అధికారులు బ్రిడ్జిపై సూచక రాళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చల్లాను కలిసిన మున్సిపల్ కమిషనర్లు



శాంతినగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఆయా మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అలంపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, అయిజ కమిషనర్ నిత్యానంద్, మేనేజర్ రాజేష్, అలంపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, బుక్కాపురం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



కొత్తపాలెంలో డ్రమ్ముల్లో నీటిని పారబోస్తున్న ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్

ధరూరు: మండల పరిధిలోని కొత్తపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి డ్రమ్ముల్లో నీటిని పారబోసి శుభ్రం చేయించారు. మరుగుదొడ్లు, బాత్రూం పరిసర ప్రాంతాలను పరిశీలించి వాటిని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కుటుంబమంతా ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. నీటి నిల్వలను వారంలో ఒక రోజు అంటే శుక్రవారాన్ని పొడి దినంగా జరుపుకోవాలన్నారు. కాల్వలు, డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విష జ్వరాల లక్షణాలు కనిపిస్తే వెంటనే ధరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు తీసుకోవాలన్నారు. ఇంట్లో పాత్రలను శుభ్రంగా కడిగి ఉంచుకోవాలన్నారు. ఆహారం తీసుకునేటప్పుడు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనంతలక్ష్మి, ఆశావర్కర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమతులేవి?



శిథిలమైన ఉప్పల బీటీ రోడ్డు

అయిజ: అయిజ నుంచి ఉప్పలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడిచినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనాలు అదుపుతప్పి అనేకమార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరగక ముందే అధకారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



వనపర్తిలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



వనపర్తిటౌన్: కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌమ్య తెలిపారు. శుక్రవారం విద్యార్థులు ఆశా, షేక్‌సానియా, లక్కీ శ్రీ,లీనా ప్రసన్నను ఆర్ఎల్‌సీ హవేలా రాణి, ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొననున్నారని ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ సుజాత పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు శాలిని, అమృత రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు భారతి, రాజేశ్వరీ తెలిపారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాష్ట్ర స్థాయికి వీరు ఎంపికైనట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



పశువుల ఆస్పత్రి ఆవరణలో ఇలా..

అయిజ: మున్సిపాలిటీలోని పశువుల ఆస్పత్రి ఆవరణలో కొన్ని సంవత్సరాల నుంచి చెత్తా చెదారం పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం లోపించి చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పట్టణంలోని వ్యర్థ పదార్థాలనన్నింటిని ఆ ప్రదేశంలో పారవేయడంతో ఆవులు, గేదెలు, ఎద్దులు తదితర జంతువులు ఆ ప్రాంతంలో మేసి అనారోగ్యం పాలవుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత సేవలు వినియోగించుకోండి

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని నియోనోటల్ అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాల్సిందిగా జిల్లా 108 మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసవం అనంతరం పసికందులకు తలెత్తే అనారోగ్య పరమైన సమస్యలకు దూర ప్రాంతాలకు అత్యవసర చికిత్సల నిమిత్తం, అత్యాధునిక నియోనోటల్ అంబులెన్స్ ద్వారా ప్రసవం అయినప్పటి నుంచి సంవత్సరం వరకు ఉచితంగా సేవలు అందిస్తుందన్నారు.

కారు బోల్తా : తప్పిన ముప్పు

అడ్డాకుల: సంకలమద్ది శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ప్రమాదం తప్పిపోయింది. కొమిరెడ్డిపల్లికి చెందిన ఆటో పెట్రోల్ బంకులోంచి హైవే మీదకు వస్తోన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నుంచి హైదరాబాద్ వైపు ఓ కారు వెళ్తోంది. ఈ క్రమంలో ఆటో అడ్డురావడంతో కారులో ఉన్న మధుసూదన్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అది అదుపు తప్పి ఆటోకు తగిలి రోడ్డుపై బోల్తాపడింది. మధుసూదన్‌తో పాటు మరొకరు స్వల్ప గాయాలతో నుంచి బయట పడ్డారు.